ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

కర్ణాటక వార్తలు
మంగళవారం 2 డిసెంబరు 2025

**చికిత్స కంటే నివారణే నయం**
● ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినంలో న్యాయాధికారి రాజేశ్ హొసమనె
9

**పాఠశాల మూసివేత నిర్ణయంపై ఆందోళన**
● రోడ్డెక్కిన తల్లిదండ్రులు, విద్యార్థులు



# కాంగ్రెష్..!

● నేడు సీఎం ఇంటికి డీసీఎం డీకే శివకుమార్

● నాయకత్వ మార్పు అంశం ముగిసినట్టేనా..?

● మీడియా ముందు నోరు మెదపని, ఎమ్మెల్యేలు, మంత్రులు

● పార్లమెంటు, అసెంబ్లీ సమావేశాలతో అగ్రనేతలు బిజీ

బెంగళూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తీవ్రస్థాయిలో చర్చకు, విభేదాలకు, వాగ్వాదాలకు కారణమైన నాయకత్వ మార్పు అంశానికి కాంగ్రెస్ అధిష్ఠానం సూచనలు, హెచ్చరికలతోనే సర్దుబాటు చేసింది. సోమవారం ఏ నాయకులు కూడా మీడియా ముందు నాయకత్వ మార్పుపై వ్యాఖ్యానించలేదు. అయితే ఈ సమన్వయం ఎంతకాలం అనేది ప్రశ్నార్థకంగా మారింది. అధిష్ఠానం సూచనతో సీఎం ఇంటికి డీసీఎం డీకే శివకుమార్ శనివారం అల్పాహార విందుకు వెళ్లారు. మంగళవారం సీఎం సిద్దరామయ్య సదాశివనగర్‌లోని డీసీఎం డీకే శివకుమార్ ఇంటికి అల్పాహార విందుకు వెళ్తున్నారు. ఇద్దరు నేతలు శనివారం మీడియా ముందుకొచ్చి మేం సమన్వయంగా పనిచేసుకు పోదలిచామని, అధిష్ఠానం ఆదేశాలను పాటిస్తామన్నారు. ఈ సమన్వయంగా బాగానే ఉంది. నాలుగురోజులకిందటి దాకా కలసి ఉన్నట్లు వేదికలు పంచుకున్నా ఎవరికివారుగా ప్రయత్నాలు, సమావేశాలు జరుపుకొన్నారు. ఇటు సీఎం, అటు డీసీఎంలకు కుల సంఘాలు, మఠాధిపతులు మద్దతు ఇచ్చారు. ఇంత జరిగాక అధిష్ఠానం ఆదేశాలతో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లతో ఇద్దరూ సర్దుకున్నారు. కానీ వారి అనుచరులు మాత్రం ఏం జరుగుతుందోననే ఆందోళన వెంటాడుతోంది. సీఎం, డీసీఎం సంతోషంగా ఉంటే వారి అనుచరులు, ఆప్తులు, ఎమ్మెల్యేల అభిప్రాయాలు వ్యక్తం చేసేందుకు వెనుకడుగు వేయాల్సి ఉంటోంది. మూడురోజులుగా మంత్రులుగానీ, స్వామీజీలుగానీ నోరు మెదపడం లేదు. కేవలం మంత్రి ప్రియాంకఖర్గే ఇటు బెంగళూరు అటు ఢిల్లీలో అంతా అధిష్ఠానం చూసుకుంటుందన్నారు. మరో మంత్రి దినేశ్ గుండూరావు మామధ్యన ఎలాంటి విభేదాలు లేవని, కలసిఉన్నామన్నారు. సోమవారం విధానసౌధలో అందుబాటులో ఉండే మంత్రులు కూడా రాజకీయాలు మాట్లాడేది లేదంటూ దాటవేశారు.



### విస్తరణపైనే ఆశలు..!

నవంబరులో కాంత్రి కొనసాగుతుందని, భారీ మార్పులు ఉంటాయని, కొత్తగా మంత్రి పదవులు దక్కుతాయని ఆశించినవారు అటు ఢిల్లీకెళ్లి ఎవరిద్వారానైనా మద్దతు కూడగట్టుకుందామనే పరిస్థితి లేదు. ఇక్కడ డీసీఎం లేదా డీసీఎంతో ప్రతిపాదనలు పెడతామంటే సాధ్యం కాని పరిస్థితి నెలకొంది. సీఎం, డీసీఎం కలసి వేదికలు పంచుకుంటున్నా మిగిలినవారి పరిస్థితి మాత్రం గందరగోళంగా మారింది. తమ జిల్లాకోటాలో మంత్రి వస్తుందని, కులం, మతం కోటాలో తమకు అవకాశం ఉంటుందని చెప్పుకున్న పలువురు నిశ్శబ్ధమే మా నినాదం అనేలా మారిపోయారు. నాలుగు రోజులుగా ఢిల్లీ వెళ్లే ప్రయత్నం కూడా ఎవరూ చేయలేదు. కేవలం మంత్రి ప్రియాంకఖర్గే మాత్రమే హస్తినకు వెళ్లారు. ఇతరులు ధైర్యం చేసేందుకు సిద్ధం కావడం లేదు. కాగా నాయకత్వ మార్పు ఎలా ఉన్నా కనీసం 10మంది మంత్రులను మారుస్తారనే చర్చ కూడా ఉంది. పదవులు దూరమవుతాయనే వారు ఎవరిని ఆశ్రయిస్తే, బాగుంటుందనే మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇటు మంత్రులు, అటు ఆశావహులు అందరూ ఒక్కసారిగా నిశ్శబ్ధం మా నినాదం అనేలా మారిపోయారు.

### ఇప్పట్లో ఢిల్లీ పిలుపు లేనట్టే..!

రాష్ట్ర రాజకీయ సమస్యపై ఢిల్లీకి పిలిపించి అధిష్ఠానం తేలుస్తుందని అందరూ భావించారు. కానీ ఇప్పట్లో ఢిల్లీకి సీఎం, డీసీఎంలను పిలిచే పరిస్థితి లేకుండా పోయింది. సోమవారం నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజే వాడివేడిగా చర్చలు సాగాయి. ఇక ప్రతిరోజూ ఇదే తరహాలోనే అగ్రనేతలు బిజీగా ఉంటారు. మరోవారం రోజుల్లోనే రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలు బెళగావిలో ప్రారంభమవుతాయి. ఈలోగా ఢిల్లీకి పిలిపించేది ఎప్పుడనేది తేలదు. పైగా శాసనసభ సమావేశాలవేళ ఢిల్లీకి పిలిస్తే రాష్ట్ర ప్రతిపక్షాలు బీజేపీ, జేడీఎస్‌లు ఇదే ప్రధానఅస్త్రంగా వాడుకునే అవకాశాలు ఉన్నాయి. దీంతో మరో ఒకటి రెండు వారాలు ఉత్కంఠ కొనసాగక తప్పదనిస్తోంది. అయితే మంత్రి పదవులుపై ఆశ పెంచుకున్న నేతల్లో మాత్రం నిరాశే మిగిలింది.

### సోనియాగాంధీకి నివేదిక అందజేసిన ఖర్గే

కర్ణాటక రాజకీయ సంక్షోభానికి సంబంధించి సమగ్ర నివేదికను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేత్రి సోనియాగాంధీకి సమర్పించినట్లు తెలుస్తోంది. ఆదివారం పార్టీ పార్లమెంటరీ సభ్యుల సమావేశం తర్వాత వారిద్దరే ప్రత్యేకంగా చర్చలు సాగించినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ప్రధానంగా కర్ణాటక రాజకీయాల్లో చోటు చేసుకున్న అంశాలపైనే ఇద్దరూ చర్చించినట్లు సమాచారం. ప్రధానంగా డీసీఎం డీకే శివకుమార్ వివాదం తారస్థాయికి చేరినా మౌనంగా ఉండడంతోపాటు అన్నీ అధిష్ఠానం చూసుకుంటుందని పదే పదే వ్యాఖ్యానించిన అంశాలు కూడా సోనియాగాంధీ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. మరోవైపు వారం క్రితం బెంగళూరులో సీఎం సిద్దరామయ్య భేటీ అయినప్పుడు అన్ని విషయాలు సోనియాగాంధీ దృష్టికే తీసుకెళ్తానని తెల్పిన అంశాన్ని కూడా ఖర్గే వివరించినట్లు తెలుస్తోంది. కానీ సీఎం సిద్దరామయ్య కుమారుడు యతీంద్ర ఇటీవల కొన్ని రోజులుగా చేసిన వ్యాఖ్యల అంశం కూడా అధిష్ఠానం దృష్టికి చేరినట్లు తెలుస్తోంది.



మంత్రి ప్రియాంక ఖర్గే నుంచి గాంధీ పురస్కారం అందుకుంటున్న అధ్యక్షురాలు కవిత, పీడీఓ బీరలింగ

## హంపదేవనహళ్లి పంచాయతీకి గాంధీ అవార్డు

కంప్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా కంప్లి తాలుకా పరిధిలోని హంప దేవనహళ్లి గ్రామ పంచాయతీకి గాంధీ పురస్కారం అవార్డు దక్కింది. సోమవారం బెంగళూరులో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ప్రియాంక ఖర్గే చేతుల మీదుగా 2023-24 సంవత్సరంలో గ్రామ పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనులను దృష్టిలో ఉంచుకుని ఈ అవార్డు అందజేసినట్లు మంత్రి తెలిపారు. అధ్యక్షురాలు కవిత ఉపాధ్యక్షురాలు లింగమ్మ చలవాది, పీడీఓ బీర్లింగ, మంత్రి ప్రియాంక ఖర్గే చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఈఓ శ్రీకుమార్ మాట్లాడుతూ.. 2023-24 సంవత్సరంలో హంపిదేవనహళ్లి గ్రామ పంచాయతీ అన్నింటిలో పనులు వేగంగా పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచామన్నారు. అధికారుల సిబ్బంది గ్రామ పంచాయతీ సభ్యులు సహకారంతోనే ఈ అవార్డు తమ గ్రామ పంచాయతీకి దక్కిందని పంచాయతీ అధ్యక్షురాలు కవిత, ఉపాధ్యక్షురాలు లింగమ్మ చలవాది హర్షం వ్యక్తం చేశారు.

## రేపు వేంకటేశ్వర స్వామి జన్మదిన వేడుకలు



హోసూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని తపోవనంలో నారేయణ తాతయ్య ఆశ్రమ వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ వేంకటేశ్వరస్వాముల 84వ జన్మదిన వేడుకలు బుధవారం జరగనున్నాయి. స్వామీజీ పుట్టినరోజును ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏటా ఘనంగా నిర్వహించే తరహాలోనే ఈ సంవత్సరం కూడా పలు కార్యక్రమాలు చేపడ్తామన్నారు. ఆశ్రమ ఆధునికీకరణ చేసి ప్రహరీని నూతనంగా నిర్మించినట్లు ఆయన తెలిపారు. స్వామీజీ ఆధ్యాత్మిక ప్రవచనాలు ఉంటాయని, హిందూ ధర్మ ప్రచారానికి కట్టుబడ్డామన్నారు. సాధువులకు సన్మానం, అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలన్నారు.

## యరమరస్ బైపాస్ వద్ద రోడ్డు ప్రమాదం

● తండ్రీకొడుకుపై దూసుకెళ్లిన లారీ
● ఇద్దరూ దుర్మరణం



నాగప్ప



రమేశ్ (ఫైల్)

రాయచూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకు దుర్మరణం చెందారు. రాయచూరు నగర సమీపం యరమరస్ బైపాస్ రోడ్డులో సోమవారం ఈ ప్రమాదం జరిగింది. రోడ్డు మలుపు వద్ద ఆగి ఉన్న తండ్రి కొడుకుల పై లారీ వేగంగా దూసుకెళ్లడంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. యరమరస్‌కు చెందిన నాగప్ప(65).. కుమారుడు రమేశ్(38)తో కలిసి బైక్‌పై వెళ్తూ మార్గమధ్యలో ఎడమ భాగంలో ఆగి ఫోన్‌లో మాట్లాడుతూ బైక్‌పై ఉన్నారు. అంతలోనే వెనకి నుంచి రాయచూరు నుంచి శక్తినగర్‌వైపు వెళుతున్న లారీ ఒకటి ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని తప్పించే క్రమంలో తండ్రీకొడుకుల పైకి దూసుకువచ్చింది. తీవ్ర గాయాలతో వారిద్దరూ అక్కడికక్కడే కన్నుమూశారు. లారీ కింద పడి ఇద్దరూ నుజ్జు నుజ్జు అయినట్లు స్థానికులు తెలిపారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి మృత దేహాలను రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.



ప్రమాదానికి కారణమైన లారీ

## చిత్తాపురలో భీమ నడె పథసంచలనం



ర్యాలీలో రాజ్యాంగ రక్షణ కార్యకర్తలు

● ప్రియాంక ఖర్గే జై అంటూ నినాదాలు

బెంగళూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కలబురగి జిల్లా చిత్తాపురలో రాజ్యాంగ సంరక్షణా సమితి ఆధ్వర్యంలో 'భీమ నడె' పథసంచలనం జరిగింది. సోమవారం చిత్తాపురకు వివిధ ప్రాంతాలనుంచి తరలివచ్చారు. చిత్తావలి చౌక్ వద్ద మధ్యాహ్నం 2.40 గంటలకు పథసంచలనం ప్రారంభమైంది. రాజ్యాంగం, అంబేడ్కర్ నినాదాలతో సాగింది. తెల్లషర్టు, ఖాకీ ప్యాంటు, నీలిటోపీ ధరించిన వందలాదిమంది ర్యాలీలో పాల్గొన్నారు. మహిళలు తెల్లచీర, నీలిరంగు జాకెట్, తలపైటోపీ ధరించారు. ఊరేగింపుగా వెళ్తున్నవారిపై పూలుచల్లారు. పథసంచలనం తర్వాత బజాజ్ కల్యాణమండపంలో బహిరంగసభ జరిగింది. ఇందుకోసం ప్రత్యేకంగా వేదిక ఏర్పాటు చేశారు. 150మంది చొప్పున మహిళలు, పురుషులు పాల్గొన్నారు. మైసూరులోని ఉరిలింగపెద్దిమఠం జ్ఞాన ప్రకాశస్వామిజీ పాల్గొన్నారు. ప్రియాంకఖర్గే జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. అడిషినల్ ఎస్పీ మహేశ్ మేఘణ్ణవర్, శహబాద్ డీఎస్పీ శంకరగౌడ పాటిల్ తదితరులు పాల్గొన్నారు. నవంబరు 16న చిత్తాపురలో ఆర్‌ఎస్‌ఎస్ పాదయాత్ర జరిపేందుకు తహసీల్దార్‌ను అనుమతులు కోరగా అదేరోజు భీమ నడె పేరిట ర్యాలీకి అనుమతులు ఇవ్వాలని దళిత పాంథర్స్ భీమపడె బృందాలు కోరాయి. రెండు ఊరేగింపులు ఒకేసారి జరిగితే వివాదం అవుతుం దని తహసీల్దార్ అనుమతులు నిరాకరించారు. ఆర్‌ఎస్‌ఎస్ హైకోర్టును ఆశ్రయించి నవంబరులో పథసంచలనం జరిపింది. అందుకు దీటుగానే భీమపడె పేరిట సోమవారం ర్యాలీ చేశారు. ప్రత్యేక వాహనంలో రాజ్యాంగం, ఆటోలపై గౌతమబుద్ధుడు, అంబేడ్కర్‌తోపాటు పలువురి చిత్రాలతో ఊరేగింపు జరిపారు.



ఊరేగింపులో డప్పులు వాయిస్తున్న యువకులు



నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

## 32 ఏళ్లకు దొరికాడు..!

బస్సు దోపిడీ కేసులో బెయిల్‌పై బయటకు వచ్చి అదృశ్యమైన నిందితుడిని పోలీసులు 32 ఏళ్ల తరువాత అరెస్టు చేశారు. కర్ణాటకలోని పావగడకు చెందిన నరసింహులును కూడేరు పోలీసులు సోమవారం అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. 1992లో కూడేరు-జల్లిపల్లి గ్రామాల మధ్య ఆర్టీసీ బస్సు దోపిడి జరిగింది. మదనపల్లి డిపో ఆర్టీసీ బస్సు బళ్లారి వైపు వెళుతుండగా.. ముగ్గురు దొంగలు బస్సును ఆపారు. కత్తులు చూపించి బెదిరించి, ప్రయాణికుల నుంచి బంగారం, నగదు దోచుకుని పారిపోయారు. కండక్టర్ వెంకటాచలపతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ముగ్గురు నిందితులను అప్పట్లో అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. బెయిల్‌పై విడుదలయ్యాక మూడో నిందితుడు నరసింహులు కోర్టుకు హాజరుకాలేదు. తప్పించుకుని తిరుగుతుండటంతో కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. దీంతో ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు గుంతకల్లు డీఎస్పీ పర్యవేక్షలో కూడేరు సీఐ రాజు, సిబ్బంది.. చెన్నేకొత్తపల్లిలో ఉంటున్న నిందితుడి కుటుంబంపై నిఘా వేశారు. ఇంటికి వచ్చినట్లు గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు. -ఆంధ్రజ్యోతి, కూడేరు

## యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాల ఆక్రమణ

● సహకరిస్తున్న కొందరు రెవెన్యూ అధికారులు ● బడా రాజకీయ నేతల అనుచరుల ఆగడాలు

బళ్లారి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలు దురాక్రమణకు గురి అవుతున్నాయి. వాగులు, వంకలు, పార్కులు, చివరకు కొండలు, పర్యాటక శాఖ ప్రదేశాల్లో ఉండే ఖాళీ స్థలాలను యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారు. ఏ భూమి ఎవరిది. ఏదీ పోరంబోకు, ఏది కొండపోరంబోకు, ఏది పట్టా, అని రికార్డులు తెలిసిన రెవెన్యూ అధికారి ఒకరు కబ్జాదారులకు సహకరిస్తున్నారని తెలుస్తోంది. ఇందులో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రుల అనుచరులు కొందరి చేతివాటం కూడా ఉంది అని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంతో ఖరీదు కలిగిన ప్రభుత్వ స్థలాలను భావితరాల కోసం కాపాడాల్సిన అధికారులు కూడా మౌనంగా ఉండడం ఒకటైతే.. కొందరు ఏకంగా ముఠాలతో చేతులు కలిపి ఎకరాకు ఇంత అని డీల్ కుదుర్చుకుంటున్నారు. బళ్లారి నగరంలో రూ. కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాలు, మఠాలకు చెందిన భూములు, అనేకంగా ఉన్నాయి. బళ్లారి అంటే చారిత్రాత్మకంగా ఎంతో పేరున్న నగరం. ఇక్కడ కొందరు వ్యక్తులు ముఠాగా చేరి ప్రభుత్వ స్థలాలను కాజేస్తున్నారు. ముందుగా ఖాళీ స్థలాల్లో రెండు వైపులా నల్లబండలు నాటడం, ఇది మాది అని నాలుగు రాళ్లు ఆ ఖాళీ స్థలంలో వేయడం కొద్ది రోజుల తరువాత అధికారులు, కబ్జాకోరులో కలిసి వాటిని ప్లాట్లుగా మార్చేస్తున్నారు. బండిహట్టి, గుగ్గరహట్టి, ఏపీఎంసీ ఏరియా, విద్యానగర్, బళ్లారి కొండ వెనుక బాగంలో ఇలా అనేక విలువైన ప్రభుత్వ స్థలాలు దురాక్రమణకు గురయ్యాయి. గతంలో ఓ తహసీల్దార్ ప్రభుత్వ భూములు రికార్డులు మార్చాడనే కారణంతో లోకాయుక్తలో కేసు కూడా నమోదు అయ్యింది. బళ్లారి కొండ ప్రాంతంలో కొండ కింద కొందరు రాజకీయ నాయకులు అనుచరులు టూరిజం స్థలాన్ని ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్నారు. కొందరు షెడ్లు వేసుకున్నారు. వీరికి రాజకీయ నాయకులు అండ కూడా ఉండడంతో అధికారులు కూడా చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల కొందరు పెద్దలు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేశారు. అంతే కాకుండా ప్రభుత్వ స్థలాలకు ప్రైవేటు లేఔట్లుగా మార్చడానికి పక్కన ఉండే సర్వేనంబర్లు వేసి ప్రభుత్వ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలుస్తోంది. బళ్లారి ఆటోనగర్ ప్రాంతంలో ఓ రాజకీయ నాయుడుడి అండతో ప్రభుత్వ స్థలాన్ని కాజేశారు. ఇలా బళ్లారి నగరంలో బ్రిటీష్ కాలం నుంచి రిజర్వుడ్ చేసిన ప్రభుత్వ స్థలాలు యథేచ్ఛగా ఆక్రమణకు గురవుతున్నాయి. ఓ కార్పొరేటర్, మరో మాజీ కార్పొరేటర్ ఇద్దరూ కలిసి మూడు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఖాజేశారు. ఇందుకు నకిలీ రికార్డులు సృష్టించి పట్టాభూమిగా రికార్డులు చేశారని లోకాయుక్తకు ఆ ప్రాంత వాసులు ఫిర్యాదు చేశారు. మరి అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.



## వేతనాలు పెంచాల్సిందే

● అంగన్‌వాడీల భారీ నిరసన
● ఫ్రీడం పార్క్‌కు తరలివచ్చిన వేలాది మంది

బెంగళూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయని, ప్రస్తుత జీవన ప్రమాణానికి అనుగుణంగా ఏమాత్రం వేతనాలు లేవని, వెంటనే జీతాలు పెంచాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు నగరంలోని ఫ్రీడంపార్కులో సోమవారం భారీ నిరసన చేపట్టారు. అంగన్‌వాడీ వర్కర్స్ అసోసియేషన్, రాష్ట్ర అక్షర దాసోహ కార్యకర్తలు ఇందులో పాల్గొన్నారు. సీఐటీయూ సంఘం వారికి మద్దతు పలికింది. ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ (ఐఎల్‌సీ) సిఫారసులకు అనుగుణంగా అంగన్‌వాడీలను ఉద్యోగులుగా పర్మినెంట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. నిరసనలో వేలాదిమంది కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్రీడం పార్క్‌లో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

**కొత్త వైరస్‌తో అప్రమత్తంగా ఉండాలి**
వైద్యుల సలహా

**నందన రవిచందర్‌కు భారత్ గౌరవ్ అవార్డు**
7

క్రైం కార్నర్

## ఎడ్లబండిని ఢీకొన్న ప్రైవేట్ బస్సు

● కాడెద్దులు మృతి.. రైతుకు తీవ్రగాయాలు



మృతిచెందిన ఎద్దులు, నుజ్జయిన బండి

విడపనకల్లు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని 42వ జాతీయ రహదారిపై పెద్దకొట్టాలపల్లి వద్ద ఓ ప్రైవేటు బస్సు సోమవారం ఉదయం 5.30 గంటల సమయంలో ఎద్దుల బండిని ఢీకొట్టింది. ప్రమాదంలో కాడెద్దులు మృతి చెందగా.. రైతుకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని పెద్దకొట్టాలపల్లికి చెందిన రైతు ఎర్రిస్వామి పప్పుశనగ పంట పొలంలో కడ్డీ గుంటక (కలుపు మొక్కలు తొలగించే గుంటక) పాసేందుకు ఉదయం 5 గంటలకు గ్రామంలో ఎద్దుల బండిని కట్టుకుని బయలుదేరి జాతీయ రహదారిపైకి వచ్చాడు. ఓ 5 నిమిషాలు ఉంటే పొలంలోకి వెళ్లేవాడు. అదే సమయంలో చెన్నై నుంచి బళ్లారికి వెళుతున్న పీఎస్ఆర్ ప్రైవేట్ ట్రావెల్ స్లీపర్ బస్సు ఎద్దుల బండిని వెనుక వైపు నుంచి ఢీ కొట్టడంతో బండి విరిగిపోయి నుజ్జు నుజ్జు అయ్యింది. ఎద్దులు ఎగిరిపోయి పొలంలో పడి అక్కడికక్కడే మృతి చెందాయి. రైతు ఎర్రిస్వామి బలమైన గాయాలతో బయట పడ్డాడు. ఎద్దుల బండిని ఢీకొట్టిన సమయంలో బస్సులో 30 మంది బళ్లారికి వెళ్లే ప్రయాణికులు ఉన్నారు. అందరూ ఒక్కసారిగా కేకలు వేస్తూ ఏమి జరిగిందోనని భయాందోళనకు గురయ్యారు. ముందువైపు డోరు తెరవటానికి రాలేదు. అతికష్టం మీద డోర్‌ను తీసి ప్రయాణికులను కిందికి దింపి మరో బస్సులో బళ్లారికి పంపారని పెద్దకొట్టాలపల్లి గ్రామస్థులు తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సును నడపటంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. మృతి చెందిన ఎద్దులకు అక్కడే పోస్టు మార్టం నిర్వహించారు. విడపనకల్లు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. బస్సు పెద్ద ప్రమాదానికి గురయినా.. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవటంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

## గర్భందాల్చిన బాలిక

● నిందితుడిపై పోక్సో కేసు నమోదు

ధర్మవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన 14 ఏళ్ల బాలిక గర్భం దాల్చింది. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. దంపతులు.. తమకు దొరికిన పాపను పెంచుకున్నారు. 14 ఏళ్ల ఆ పాపపై ధర్మవరానికి చెందిన నరసింహులు కన్నేశాడు. బాలికను బెదిరించి, పలుమార్లు అత్యాచారం చేశాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. ఈ నేపథ్యంలో బాలిక గర్భం దాల్చింది. కడుపు నొప్పిగా ఉందని బాలిక చెప్పడంతో వైద్యుల వద్దకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు.. బాలిక గర్భం దాల్చినట్లు చెప్పారు. బాలిక విషయం మొత్తం చెప్పింది. నరసింహులుపై బాలికను పెంచిన తల్లి.. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు అతడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నట్లు సమాచారం. నరసింహులుకు వివాహమై, ముగ్గురు పిల్లలున్నారు.

## మూడు ఓవర్లు.. రూ.లక్షల్లో బెట్టింగులు

● ఒక్కో మ్యాచ్‌కు రూ.లక్షలు పందెం
● ధర్మవరం క్రీడామైదానంలో యథేచ్ఛగా క్రికెట్ బెట్టింగ్

ధర్మవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ధర్మవరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో క్రికెట్ బెట్టింగ్ జోరుగా సాగుతోంది. మామూలుగా క్రికెట్ మ్యాచ్ అంటే 20 ఓవర్లు ఉంటాయి. ఇక్కడ మాత్రం మూడు ఓవర్లు మాత్రమే ఉంటాయి. కొత్త విధానానికి ధర్మవరం క్రీడామైదానాన్ని వేదికగా మార్చారు కొందరు ప్రబుద్ధులు. ఈ క్రీడామైదానం డీఎస్పీ కార్యాలయానికి, వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు అతి దగ్గర్లో ఉన్నాయి. ఈ క్రీడామైదానంలో బెట్టింగ్ క్రికెట్ చూసేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివెళ్తున్నారు. ఈ క్రికెట్‌లో బండరాయి వికెట్లు, రబ్బరు బాల్‌తో క్రికెట్ ఆడుతున్నారు. ఇందులో ప్రతిబాల్‌ను ఉతకడమే మ్యాచ్ ప్రత్యేకత. ఒక్కో టీంకు ఐదుగురు చొప్పున రెండు టీంలకు మొత్తం 10 మంది క్రీడాకారులు ఉంటారు. మ్యాచ్ మొత్తం మూడు ఓవర్లే. ఏ టీం మూడు ఓవర్లలో ఎక్కువ స్కోరు చేస్తుందో ఆ టీం గెలిచినట్టే. ఒక్కో మ్యాచ్‌కు రూ.లక్షలు పందెం. మూడు ఓవర్లలో ఒక టీం 50 పరుగులు చేస్తే మరో టీం 51 పరుగులు చేసిందంటే ఆ టీం గెలిచినట్టే. ఈ బెట్టింగ్ క్రికెట్‌లో ఒక్కో మ్యాచ్‌కు రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు ఆడుతున్నారు. కేవలం గంటలోపే మ్యాచ్ మొత్తం ముగుస్తుంది. వారానికి మూడు లేదా నాలుగు రోజులు మాత్రమే బెట్టింగ్ క్రికెట్ ఆడుతూ లక్షల్లో బెట్టింగ్ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రీడామైదానానికి డీఎస్పీ కార్యాలయం, వన్‌టౌన్ పోలీసు స్టేషన్ దగ్గరలో ఉన్నా, ఇంత పెద్ద ఎత్తున బెట్టింగ్ క్రికెట్ ఆడుతున్నా, రోజు లక్షల్లో చేతులు మారుతున్నా ఇదేమి పట్టనట్టు పోలీసులు వ్యవహరిస్తున్నారు. కొంతమంది పోలీసులు ఈ క్రికెట్ మ్యాచ్ ఆడే క్రీడాకారులతో సొమ్ము చేసుకుంటున్నట్టు సమాచారం.

## హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక



ఎంపికైన ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్ సీనియర్స్ ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేశారు. సోమవారం స్థానిక ఎల్ఆర్‌జీ స్కూల్‌లో హ్యాండ్‌బాల్ సీనియర్స్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన జట్టు వివరాలను హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రియాజ్ అహ్మద్, సాకే శివశంకర్ తెలిపారు. ఎంపికైన జట్టులో.. భరత్, కృష్ణ, సాయికిరణ్, రాజు, వినోద్‌నాయక్, వినయ్‌కుమార్, ప్రసాద్‌నాయక్, హరినాథ్, దుశ్యంత్, హర్ష, సిద్దిక్, రవి, ధనుష్, నాగలితీష్, పవన్‌కుమార్, ప్రణీత్ ఉన్నారు. ఈ జట్టు ఈనెల 4వతేదీ నుంచి కర్నూలులో నిర్వహించే 11వ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి రవి, సీనియర్ క్రీడాకారులు ఆది, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రా బ్యాటర్లు అదరహో..!

● శతకంతో రాణించిన ఓపెనర్ వీరారెడ్డి
● సెంచరీ చేజార్చుకున్న శ్రీనివాస్



వీరారెడ్డి



శ్రీనివాస్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): కర్ణాటకతో మ్యాచ్‌లో ఆంధ్రా బ్యాటర్ల అదరహో అనిపించారు. బీసీసీఐ కూచ్ బెహర్ ట్రోఫీ అండర్-19లో భాగంగా స్థానిక అనంత క్రీడా గ్రామంలోని రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో సోమవారం ఆంధ్రా, కర్ణాటక జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభించారు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కి దిగిన ఆంధ్రా జట్టు 91 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 300 పరుగులు చేసింది. ఓపెనర్ కేహెచ్ వీరారెడ్డి 163 బంతుల్లో 5 సిక్సర్లు, 10 బౌండరీలతో శతకం (114) బాదాడు. మరో బ్యాటర్ కేఎల్ శ్రీనివాస్ 225 బంతుల్లో 2 సిక్సర్లు, 11 బౌండరీలతో సెంచరీ (98 పరుగులు) చేజార్చుకున్నాడు. ఏఎన్‌వీ లోహిత్ 41, పరమ్‌వీర్ 24 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు.

# కమనీయం.. ధ్వజారోహణం





అలంకరణలో నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



నరసింహ స్వామి ఆలయంలో ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

మడకశిర రూరల్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిచెందిన భక్తరహళ్ళి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ధ్వజారోహణం కమనీయంగా సాగింది. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. హోమాలు చేశారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి.. స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి, పూజలు నిర్వహించారు. వారిని ఈఓ నరసింహరాజు శాలువాతో సన్మానించారు.

# అన్ని చెరువులు నింపాలి

● రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి ● హంద్రీనీవా కాలువ పరిశీలన



మాట్లాడుతున్న బొజ్జ దశరథ రామిరెడ్డి

సోమందేపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాలకులు ఇచ్చిన హామీ మేరకు హంద్రీనీవా కాలువ కింద అన్ని చెరువులు నింపాలని రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథ రామిరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్ర సమీపాన హంద్రీనీవా కాలువను సమితి సభ్యులతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. బొజ్జ దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ.. హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లోని 260చెరువులను నీటితో నింపుతామనీ, ప్రతి ఎకరాకు నీరు ఇస్తామని ప్రభుత్వ పెద్దలు వాగ్దానం చేశారన్నారు. ఇంతవరకు మూడు చెరువులు మాత్రమే నింపారన్నారు. కాలువలో వెయ్యిక్యూసెక్కులు ప్రవహించాల్సి ఉండగా.. రెండు పంపులతో 214క్యూసెక్కులు మాత్రమే పంపింగ్ చేస్తున్నారన్నారు. మిగతా ఆరు పంపులు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు 5 టీఎంసీల నీరు విడుదల చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 0.85 టీఎంసీలు మాత్రమే ఇచ్చారన్నారు. ఏటా రైతులకు నీటి భరోసా ఇవ్వడమే తప్ప.. సమృద్ధిగా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. దీంతో ఆయకట్టు రైతులు పంటలను సాగుచేయడం లేదన్నారు. నిర్వహణ సరిగా లేక కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగిపోయి హంద్రీనీవా కాలువ అధ్వానంగా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు కాలువలు, చెరువుల పరిస్థితిని పరిశీలించి స్పష్టమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. అనంతరం హెచ్ఎన్ఎస్ఎస్ ఇంజనీర్ వీరబాబుతో పలు సమస్యలపై నాయకులు చర్చించారు. కార్యక్రమంలో హనుమంతరెడ్డి, ఖాసీం, చైతన్య గంగిరెడ్డి, జలసాధన సమితి ఉమ్మడి జిల్లా నాయకులు పాల్గొన్నారు.

### సహకార ఉద్యోగుల సంఘం
## రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాలగంగాధర్



అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏపీ సహకార ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ జీకే బాలగంగాధర్‌ను ఎన్నుకున్నారు. విజయవాడలో ఆదివారం జరిగిన ఏపీ సహకార ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గం ఎన్నికల్లో జిల్లాకు చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ జీకే బాలగంగాధర్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ సోమర జయచంద్రనాయుడు, సహకార ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లరాయుడు, కుమార్ తదితరులు బాలగంగాధర్‌కు అభినందనలు తెలిపారు.

### శిక్షణకు వెళ్లిన జడ్పీ సీఈఓ

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్ డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీఓ) ఇండక్షన్ శిక్షణకు విజయవాడకు వెళ్లారు. నూతనంగా డీడీఓలుగా పదోన్నతి పొందిన వారికి శిక్షణ ఇస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే మొదటి విడతలో డీడీఓ నాగశివలీల అక్టోబరు 5 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించిన శిక్షణకు హాజరయ్యారు. రెండో విడతలో భాగంగా డీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందిన వారిలో డిప్యూటీ సీఈఓ, ఏపీడీలుగా ఉన్న వారికి మొదటి దశ శిక్షణలో భాగంగా ఈనెల 5వ తేది నుంచి 19వ తేది వరకు 15 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. దీంతో డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య శిక్షణను పూర్తి చేసుకొని వచ్చారు. మూడో విడతలో భాగంగా డిసెంబరు 1వ తేది నుండి 13వ తేదీ వరకు ఇచ్చే శిక్షణలో పాల్గొనడానికి సీఈఓ శివశంకర్ వెళ్లారు.

### టమోటా కిలో రూ.37

అనంతపురం రూరల్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో సోమవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.37తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.20తో, సరసరిగా రూ.27తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1050 టన్నుల టమోటాలు వచ్చాయన్నారు.

## మహిళలు, బాలికలపై హింసను ఆపాలి

● కలెక్టర్ ఆనంద్.. పోస్టర్లు విడుదల

అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికలపై జరిగే హింసను ఆపడానికి సమాజంలోని అన్ని వర్గాల వారిని భాగస్వాములు చేయాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. మహిళలపై హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ పక్షోత్సవాల నేపథ్యంలో కలెక్టర్, ఇతర అధికారులు పోస్టర్లను విడుదల చేశారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సెల్ఫీ బూత్, సైన్ బోర్డు ఏర్పాటు చేశారు. అనంతరం జేసీ శివ్‌నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఆర్ఓ మలోల, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి తదితరులతో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ, పలువురు అధికారులు సంఘీభావంగా సెల్ఫీలు దిగి, సిగ్నేచర్ క్యాంపెయిన్ బోర్డుపై సంతకాలు చేశారు.

### డిప్యూటీ ఎంపీడీఓలకు పోస్టింగులు

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందిన వారికి జిల్లాల్లో కేటాయింపులు చేస్తూ కమిషనర్ నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా సత్యసాయి జిల్లాకు కేటాయించిన వారిలో సోమవారం 31 మందికి మండలాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సీకే పల్లి, కనగానపల్లి మండలాకు కేటాయించిన డిప్యూటీ ఎంపీడీఓలు సోమవారం రిలీవ్ అయ్యి అక్కడ డిప్యూటీ ఎంపీడీఓలుగా బాధ్యతలు చేపట్టారు. మరో రెండు రోజుల్లో మిగిలిన వారు కూడా రిలీవ్ అయ్యి వారికి కేటాయించిన మండలాల్లో బాధ్యతలు చేపట్టనున్నారు. అనంతపురం జిల్లాకు కేటాయించిన వారికి సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు.

### చీనీ టన్ను రూ.21వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.21వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.15వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు 44టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

# మేనమామే హంతకుడు

● పథకం ప్రకారమే బాలుడి హత్య
● నిందితుడి అరెస్ట్: డీఎస్పీ

కదిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలంలో సంచలనం సృష్టించిన కొమ్మెర హర్షవర్ధన్ అనే బాలుడి హత్య కేసులో మేనమామను పోలీసులు అరెస్ట్ చేశారు. పథకం ప్రకారమే హత్య చేసినట్లు నిందితుడు ప్రసాద్ దర్యాప్తులో ఒప్పుకున్నట్లు కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. సోమవారం కదిరి రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. గత నెల 26న ఉదయం 11 గంటలకు తలుపుల మండల పరిధిలోని గరికపల్లికి చెందిన ఐదు సంవత్సరాల హర్షవర్ధన్ కనిపించాకుండా పోయాడు. సాయంత్రం వరకు వెదికిన తల్లిదండ్రులు.. అదేరోజు తలుపుల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 27వతేదీ తెల్లవారుజామున 3గంటలకు ఎన్పీకుంట మండలంలోని మర్రికొమ్మెదిన్నె, జొకల మధ్యలోని అటవీప్రాంతంలో బాలుడి శవాన్ని కనుగొన్నారు. బాలుడిని హత్యపై దర్యాప్తు మొదలు పెట్టారు. మొదటగా బాలుడి మేనమామ ప్రసాద్‌పై పోలీసులకు అనుమానం వచ్చింది. 26వ తేదీ ఉదయం నుంచి బాలుడు మేనమామ వద్దే ఉండడంతో ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. చివరకు బాలుడి మేనమామే హంతకుడిగా నిర్ధారణకు వచ్చారు. నిందితుడిని సోమవారం మధ్యాహ్నం కదిరి మున్సిపాలిటీ పరిధిలోని మూర్తిపల్లి సబ్ స్టేషన్ వద్ద అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు వివరించారు. సమావేశంలో రూరల్ సీఐ నాగేంద్ర, తలుపుల ఎస్ఐ నరసింహుడు ఉన్నారు.

**పథకం ప్రకారమే హత్య..**

బాలుడు హర్షవర్ధన్‌ను అతడి మేనమామ ప్రసాద్ పథకం ప్రకారమే హత్య చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. నిందితుడి కుమారుడు బ్లడ్‌క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఈ విషయంపై ప్రసాద్ బావ గంగాధర్ సూటిపోటి మాటలతో ఇబ్బంది పెట్టాడన్న కక్ష పెంచుకున్నాడు. తన కుమారుడు లేకుండాపోతే ఎంత బాధ ఉంటుందో.. తన బావమరిది కూడా అంత బాధను చూపించాలని మనసులో పెట్టుకున్నాడు. రెండుమూడునెలలుగా హర్షవర్ధన్‌ను మేనమామ బాగా మచ్చిక చేసుకున్నాడు. ఆ అనుబంధంతోనే బాలుడిని నమ్మించి, గతనెల 26న ద్విచక్రవాహనంలో ఎక్కించుకుని ఎన్పీకుంట మండలం మర్రికొమ్మెదిన్నె, జొకల మధ్యలో ఉన్న అడవిలోకి తీసుకెళ్లి ఓ చెట్టుకింద గొంతు నులిమి హత్యచేసినట్లు డీఎస్పీ తెలిపారు. దర్యాప్తులో సంఘటనా స్థలం వద్ద నిందితుడి పర్సు, ఆధార్‌కార్డు, బాలుడి చెప్పులు, నిందితుడి చెప్పులు లభ్యమైనట్లు చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పిల్లలపట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని డీఎస్పీ సూచించారు. కేసును చేధించిన సీఐ, ఎస్ఐ, పోలీసులను డీఎస్పీ అభినందించారు.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, పోలీస్ అధికారులు

### సీనియర్ జర్నలిస్టు
## కాలవ రమణ కన్నుమూత

● నివాళులు అర్పించిన జర్నలిస్టులు, ప్రముఖులు



అనంతపురం ప్రెస్‌క్లబ్/రూరల్/కళ్యాణదుర్గం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రముఖ పాత్రికేయుడు కాలవ వెంకట రమణ అనారోగ్యంతో సోమవారం కన్నుమూశారు. కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందినా, కోలుకోలేకపోయారు. ఆరోగ్యం మరింత క్షీణించడంతో సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. కాలవ రమణ పలు పత్రికల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. విషయం తెలియగానే పలువురు జర్నలిస్టులు, మిత్రులు ఆస్పత్రి వద్దకు వెళ్లి పుష్పాంజలి ఘటించారు. ఆయన మృతదేహాన్ని హిందూపురానికి తరలించి, అంత్యక్రియలను నిర్వహించారు. ఆయనకు భార్య, ఇంటర్ చదువుతున్న కూతురు ఉన్నారు.

**ప్రముఖుల సంతాపం**

● సీనియర్ జర్నలిస్టు కాలవ రమణ అకాల మరణంపై కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా సమస్యలపై స్పందిస్తూ, అనేక కథనాలను రాసిన ఆయన.. సమాజసేవకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయన మృతి బాధాకరమని అన్నారు. ఆయన కుటుంబానికి తనవంతుగా రూ.లక్ష ఆర్థిక సాయం అందజేస్తానని ప్రకటించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు.

● సీనియర్ జర్నలిస్టు కాలవ రమణ కుటుంబానికి అండగా ఉంటామని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి అన్నారు. ఆయన మృతిపట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. జిల్లా సమస్యలపై ప్రజల తరఫున స్పందిస్తూ సమాజ సేవకు ఆయన ఎంతో కృషిచేశారని అన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రభుత్వ అధికారులతో మంచి సంబంధాలు కొనసాగించారని కొనియాడారు. మంచి మిత్రుడిగా, అందరినీ ఎంతో ఆప్యాయంగా పలకరించే వ్యక్తి దూరం కావడం చాలా బాధాకరమని అన్నారు.

## కేంద్రీయ విద్యాలయాల్లో ఉద్యోగాలు

గోరంట్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కేంద్రీయ విద్యాలయాల్లో దేశవ్యాప్తంగా 9,126, నవోదయ విద్యాలయ సమితిలో 5,841 మొత్తం 14,967 ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గోరంట్ల మండలం పాలసముద్రం కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ క్రిష్టారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో బోధన, బోధనేతర, ఉద్యోగాల భర్తీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. అసిస్టెంట్ కమిషనర్లు, ప్రిన్సిపాళ్లు, వైస్ ప్రిన్సిపాళ్లు, పీజీటీ, టీజీటీలు, పీఆర్‌టీలు, స్పెషల్ ఎడ్యుకేటర్లు, లైబ్రేరియన్లు, వివిధరకాల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఎంపికైన అభ్యర్థులను భారతదేశంలో ఎక్కడైనా నియమించవచ్చన్నారు. బీఈడీ, ఎంఈడీ లాంటి సూచించిన విద్యార్హతలను అభ్యర్థులు కలిగి ఉండాలని తెలిపారు. భారత ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు ఉంటాయని వివరించారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు అధికారిక నోటిఫికేషన్ పరిశీలించాలన్నారు.

## జేఎన్‌టీయూ వీసీకి జాతీయ అవార్డు



వీసీకి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు చెబుతున్న రిజిస్ట్రార్, డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ వీసీ ఆచార్య సుదర్శనరావుకు జాతీయ అవార్డు లభించింది. ఈ మేరకు సోమవారం రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. కృష్ణయ్య ఆధ్వర్యంలో డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, సిబ్బంది వీసీని ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. 2025వ సంవత్సరానికిగానూ ఉత్తమ అకడమిక్ అడ్మినిస్ట్రేటర్‌గా ప్రతిష్ఠాత్మకమైన 55వ ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌టీఈ) జాతీయ అవార్డు గత నెల 29వ తేదీన ప్రదానం చేసినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. వీసీకి శుభాకాంక్షలు తెలిపిన వారిలో వీసీ ఓఎస్‌డీ ఆచార్య ఎన్. దేవన్న, యూనివర్సిటీ డైరెక్టర్లు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, వైస్ ప్రిన్సిపాళ్లు, బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు.

## శిశుగృహలో ఏడుగురి తొలగింపు

అనంతపురం వైద్యం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని శిశుగృహలో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న ఏడుగురు సిబ్బందిని విధుల నుంచి శాశ్వతంగా తొలగించారు. ఈ మేరకు కలెక్టర్ ఆనంద్ ఆదేశాలతో ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి సోమవారం ఉత్తర్వులు అందజేశారు. మేనేజర్ దీప్తి, సోషల్ వర్కర్ లక్ష్మీదేవి, ఏఎన్ఎం గుణవతి, ఆయాలు ప్రభావతి, ఆదిలక్ష్మి, నూర్జహాన్, వాచ్‌మన్ రాజశేఖర్‌ను తొలగించినట్లు పీడీ అరుణకుమారి తెలిపారు. శిశువుల సంరక్షణకు ఇబ్బందులు తలెత్తకుండా ఏఎన్ఎంలను ఏర్పాటు చేశామన్నారు.

**నిర్లక్ష్య ఫలితం:** శిశుగృహలో ఆశ్రయం పొందుతున్న చిన్నారి నిరూప్ అక్టోబరు 2న మృతిచెందిన విషయం తెలిసిందే. చిన్నారి మృతి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా నిబంధనలు విస్మరించి నిరూప్ మృతదేహాన్ని శిశుగృహ సిబ్బంది ఖననం చేశారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించడంతో ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించి శిశుమరణంపై సమగ్ర విచారణ చేయాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని ఆదేశించారు. మహిళా, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక విచారణ కమిటీలను ఏర్పాటు చేశారు. నిరూప్ మృతిని జిల్లా కోర్టు సుమోటోగా తీసుకుంది. తక్షణ చర్యలకింద పీడీ నాగమణిని సస్పెండ్ చేశారు. అనంతరం చేపట్టిన విచారణలో శిశుగృహ సిబ్బంది నిర్లక్ష్యంతోనే నిరూప్ మృతిచెందినట్లు కమిటీలు నిర్ధారించాయి. ఆ మేరకు న్యాయపరమైన చిక్కులు లేకుండా శిశువు మృతికి కారకులపై చర్యలు తీసుకునేందుకు రెండు నెలలపాటు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేసింది. ఎట్టకేలకు ఏడుగురిని శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగించింది.

## పరిశ్రమల సృష్టికర్త చంద్రబాబు

● రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత



దివ్యాంగుడికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న మంత్రి

రొద్దం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశ్రమల సృష్టికర్త అని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. సోమవారం రొద్దం మండలంలోని సానిపల్లిలో వృద్ధులు, వికలాంగులకు ఇంటింటికి వెళ్లి పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతినెలా ఇంటివద్దకే వెళ్లి పింఛన్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. కియా లాంటి పరిశ్రమలో వేలాది మంది నిరుద్యోగులు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఎంఎస్ఎంఈలతో రాష్ట్రానికి కుప్పలు తెప్పలుగా పరిశ్రమలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేస్తామనీ మంత్రి సవిత అన్నారు. సోమవారం రొద్దంలోని వెలుగు కార్యాలయంలో డివిజన్‌స్థాయి ఫిర్యాదుల దినోత్సవం నిర్వహించారు. ప్రజా సమస్యలపై వందలాది మంది తరలిరాగా మంత్రి అందరి సమస్యలూ విన్నారు.

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

### బి. నాగిరెడ్డి (జయంతి)



ప్రముఖ తెలుగు సినీ నిర్మాత, దర్శకుడు బొమ్మిరెడ్డి నాగిరెడ్డి 1912 డిసెంబరు 2న కడప జిల్లా కొండాపురం మండలం పొట్టిపాడులో జన్మించారు. ఆయన రూపొందించిన షావుకారు, పాతాళభైరవి, మాయాబజార్, మిస్సమ్మ, గుండమ్మ కథ వంటి సినిమాలు సూపర్ హిట్‌గా నిలిచాయి. చెన్నైలో విజయవాహిని స్టూడియో ఏర్పాటు చేశారు. చక్రపాణితో కలసి పెద్దసంఖ్యలో సినిమాలు రూపొందించారు. టీటీడీ ఛైర్మన్‌గా తిరుమలలో వైకుంఠ క్యూ కాంప్లెక్స్ నిర్మించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికను, చందమామ మాసపత్రికను ప్రారంభించారు. నంది అవార్డు, దాదాసాహెబ్ ఫాల్కే, కళైమామణి తదితర అవార్డులు పొందారు. 2004 ఫిబ్రవరి 25న కన్నుమూశారు.

### మర్రి చెన్నారెడ్డి (వర్ధంతి)



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్య మంత్రిగా రెండు పర్యాయాలు కొనసాగిన మర్రి చెన్నారెడ్డి 1919 జనవరి 13న వికారాబాద్ తాలూకా మార్పల్లి మండలం సిరిపురం గ్రామంలో జన్మించారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా కొనసాగారు. ఉత్తరప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు రాష్ట్రాలకు గవర్నర్‌గా వ్యవహరించారు. 1941లో ఎంబీబీఎస్ పొందిన ఆయన విద్యార్థి దశలో ఆంధ్రయువజన సమితి, విద్యార్థి కాంగ్రెస్‌ను స్థాపించారు. రాజకీయాలలో తనదైన ముద్ర వేశారు. 1996 డిసెంబరు 2న కన్నుమూశారు.

### మోనికా సెలెస్ (పుట్టినరోజు)



అంతర్జాతీయస్థాయిలో పేరొందిన టెన్నిస్ క్రీడాకారిణి మోనికా సెలెస్ 1973 డిసెంబరు 2న యుగోస్లేవియాలో జన్మించారు. యుగోస్లేవియా, యునైటెడ్ స్టేట్స్ నుంచి ప్రాతినిధ్యం వహించి 'వరల్డ్ నెంబరు వన్'గా నిలిచారు. 16వ యేటకే ఫ్రెంచ్ ఓపెన్ ఛాంపియన్‌గా నిలిచారు. 8 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌ను అందుకుని టెన్నిస్‌లో తనదైన రికార్డు నెలకొల్పారు. 2009లో ఇంటర్నేషనల్ టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్ పురస్కారం అందుకున్నారు. టెన్నిస్ క్రీడాకారిణిగా రిటైరయ్యారు. '30 లెజెండ్స్ ఆఫ్ ఉమెన్స్ టెన్నిస్'లో ఒకరిగా నిలిచారు.

## ఎస్ఈసీఐతో అక్మె ఒప్పందం

బెంగళూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అక్మె సోలార్ హోల్డింగ్స్ సంస్థ తన సామర్థ్యాన్ని పెంచుకునేందుకు అనుబంధ సంస్థ ఉర్జా ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా ఎస్ఈసీఐతో ఒప్పందం చేసుకుంది. 100 ఎండబ్ల్యూ/ 400 ఎండబ్ల్యూహెచ్ బ్యాటరీ సేకరణ పథకంకోసం ప్రతి యూనిట్‌కు రూ.3.42 చొప్పున 200 మెగావాట్ల సౌరశక్తి పథకానికి 25ఏళ్లపాటు విద్యుత్ కొనుగోలుకై ఒప్పందం కుదుర్చుకుంది. మొత్తం పీపీఏ సామర్థ్యం 5.38 గిగావాట్లకు పెరగనుంది. ఈమేరకు నగరంలో సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

## వాహనాల తనిఖీ

కంప్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : హంపి పుణ్యక్షేత్రానికి వచ్చే వాహనాలను సోమవారం పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. డుతున్నారు. ఇటీవల ఢిల్లీలో బాంబు పేలుళ్ల నేపథ్యంలో పర్యాటక ప్రాంతాల్లో భద్రత పెంచినట్లు పోలీసులు తెలిపారు. కడిరాంపురం, హంపి తదితర ప్రాంతాల్లో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

# కొత్త వైరస్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

▸▸ వైద్యనిపుణుల సలహా

బెంగళూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొత్త వైరస్‌ల ద్వారా వచ్చే జ్వరాలు ఇతరత్రా సమస్యలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యనిపుణులు అభిప్రాయపడ్డారు. ఫీవర్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎఫ్ఐ) మైక్రోల్యాబ్స్ ఇండియా సహకారంతో ఎనిమిదో విడత సమ్మేళనం నగరంలో జరిగింది. క్లినికల్ డెవలెప్‌మెంట్ సర్వీసెస్ ఏజెన్సీ ఛైర్మన్ డాక్టర్ ఎండీ రవి మాట్లాడుతూ కొవిడ్ వేళ డాక్టర్లు తమ ప్రయత్నాలకు మించి చికిత్సలు అందించారన్నారు. తద్వారా పలువురు వైద్యులు కూడా వైరస్ బారినపడ్డారన్నారు. కానీ ఎటువంటి వైరస్‌లకైనా డాక్టర్లు సకాలంలో చికిత్సలు అందించే నైపుణ్యత కలిగి ఉన్నారన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే వైరస్‌ల సవాళ్లను ఎదుర్కొనేందుకు డాక్టర్లు సిద్ధంగా ఉండాలన్నారు. జ్వరం వచ్చినప్పుడు వైరస్, ఇతర కారణాలను వెతకడం ముఖ్యమేనన్నారు. డెంగ్యూ, శ్వాసకోశ వంటి సమస్యలతో రోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వరం వచ్చినప్పుడు యాంటి బయాటిక్‌ల వాడకంతోపాటు డాక్టర్ల సలహాలను పాటించాలనే అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా (ఏపీఐ) ఛైర్మన్ ప్రొఫెసర్ జ్యోతిర్మయ పాల్ మాట్లాడుతూ భారత్‌లో ఎక్కువభాగం ఎండ వాతావరణం ఉన్నందున అనేకమైన రోగాలు జ్వరంతోనే ప్రారంభమవుతాయన్నారు. వైద్యం అందించేముందు డయాగ్నస్టిక్ కీలకమన్నారు. ఏపీఐ అధ్యక్షులు డాక్టర్ జీ నరసింహులు, ఫీవర్ ఫౌండేషన్ ఇండియా సంచాలకులు మంజుళ తదితర వైద్యనిపునులు పాల్గొన్నారు. ఏఐ ఆధారిత హాకథాన్ విజేత విద్యార్థులను అభినందించారు.



సమ్మేళనంలో పాల్గొన్న వైద్యనిపుణులు

## అలరించిన హాస్యోత్సవం



హాస్య సాహితీవేత్తలకు సన్మానం

చింతామణి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తాలూకా బ్రాహ్మణ మహాసభ ఆధ్వర్యంలో నగెహబ్బ పేరిట హాస్యోత్సవం సభికులను అలరించింది. 2026 వార్షిక క్యాలెండర్ విడుదల, కన్నడ రాజ్యోత్సవాన్ని పట్టణంలోని శారదా శంకర ప్రార్థనామందిరంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రముఖ హాస్య సాహితీవేత్తలు ఎంఎస్ నరసింహమూర్తి, వైఎస్ గుండూరావు, దుండిరాజ్, ఎకేబీఎంఎస్ చిక్కబళ్ళాపుర జిల్లా ప్రతినిధి పీఆర్ ప్రకాశ్, ప్రముఖ న్యాయవాది బీఆర్ శ్రీనాథ్ ప్రారంభించారు. ప్రకాశ్ మాట్లాడుతూ తాలూకా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కన్నడ రాజ్యోత్సవంలో పిల్లల ప్రతిభను చాటేలా కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. హాస్య సాహితీ వేత్తలచే నగె హబ్బ ద్వారా సభికులను హాస్యంలో ముంచెత్తారు. సంఘం అధ్యక్షుడు ఎస్ కృష్ణ మాట్లాడుతూ సంఘం అందరి సభ్యులు, పదాధికారుల సహకారంతో ఇలాంటి కార్యక్రమాలు సాధ్యమన్నారు. చిన్నారులచే పద్మవేషం, భగవద్గీత, యోగ నృత్యం, భరతనాట్యం, కథక్, రసమంజరి గాయన కార్యక్రమాలు అలరించాయి. ఇదే సందర్భంగా సంఘం వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. వేదబ్రహ్మ వీఆర్ రమేశ్‌శర్మా వేదఘోష ఆకట్టుకుంది. కార్యక్రమంలో సంఘం పదాధికారులు పాల్గొన్నారు.

## ఆనేకల్‌లో కన్నడ రాజ్యోత్సవం

దొమ్మసంద్ర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో కన్నడ రాజ్యోత్సవం నిర్వహించారు. కన్నడమాత భువనేశ్వరిదేవి ఉత్సవమూర్తికి విశేషపూజలు చేశారు. బెంగళూరు గ్రామీణ ఎంపీ డాక్టర్ సీఎన్ మంజునాథ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కన్నడ కేవలం భాష కాదని, మన గుర్తు, సంస్కృతికి ప్రతీక అన్నారు. కన్నడిగుడిగా జన్మించడం భాగ్యమని, అయితే కన్నడిగుడిగా జీవనం సాగించడం బాధ్యతతో కూడి ఉందన్నారు. మన జీవనంలో అన్ని వ్యవహారాలలో కన్నడ మమేకం కావాలన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులను సత్కరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రధాన సీనియర్ సివిల్ న్యాయాధికారి కృష్ణరాజ్, రెండో ఇన్‌చార్జ్ సీనియర్ సివిల్ న్యాయాధికారి మంజునాథ్, ప్రధాన సివిల్ న్యాయాధికారి జనార్ధన, డాక్టర్ మునిరాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యానిపుణుడు జీ. మునిరాజుకు సన్మానం

## సమస్యల పరిష్కారానికి కార్యాచరణ

మహదేవపుర, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి తమ ప్రాధాన్యత అని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్యాచరణ చేపట్టినట్టు ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని మున్నెకొళ్ళాల, మారతహళ్ళి, యమలూరు, కరియమ్మన అగ్రహార, కసవనహళ్ళి, హరలూరు, బెళ్ళందూరు, కైకొండ్రహళ్ళి సహా పలు ప్రాంతాల రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయడం, పుట్‌పాత్‌లకు మరమ్మతు పనులు, అవసరమైన చోట్ల కాంక్రీట్‌రోడ్డు నిర్మాణాలకు భూమిపూజ చేశారు. మారతహళ్ళిలోని అశ్వత్‌నగర్‌లోని మారియమ్మదేవాలయ జీర్ణోద్ధరణ, ఆలయ వాస్తుపూజా కార్యక్రమాలతోపాటు పలు ధార్మిక కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్లను బాగు చేయడం, నీటి సమసయ పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ హోబళి అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ప్రముఖులు రమేశ్, సురేశ్, నాగేశ్ రెడ్డి, రాజేశ్, యోగానంద తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజలో ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి తదితరులు

## ఆత్మీయంగా గురువందన



గురువులతో సీనియర్ విద్యార్థుల సంఘం సభ్యులు

దొమ్మసంద్ర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా దొమ్మసంద్ర పట్టణంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ హైస్కూల్ సీనియర్ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో గురువందన కార్యక్రమం ఆత్మీయంగా సాగింది. సీనియర్ ఉపాధ్యాయులు హెచ్‌సీ వీరప్ప, ఎన్‌పీ రాఘవేంద్రరావ్, ఎం రామాంజనేయలను సత్కరించి గౌరవించారు. 1975-80 హైస్కూల్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎం మునిరెడ్డి మాట్లాడుతూ గురువులు తమకు బతుకు దిక్కుచూపిన దీపస్తంభాలన్నారు. తాము ఎంత ఎత్తుకు ఎదిగినా తమకు అండగా నిలిచిన గురువులను వేదికపై సత్కరించే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. శిక్షణ అంటే కేవలం పాఠ్యపుస్తకాల జ్ఞానం కాదని బతుకును చూపే పాఠమని దాన్ని తమకు గురువులు అందించారన్నారు. గురువులు చూపిన మార్గం వల్లనే తాము సమాజంలో గుర్తింపు సాధించామన్నారు. తమకు చక్కటి మార్గదర్శకం, క్రమశిక్షణ, నైతిక విలువలు నేర్పించడంతోనే జీవితానికి ఆధారంగా ఉన్నాయన్నారు. గురుశిష్యుల సంబంధాన్ని ప్రతి ఒక్కరూ మరువరాదన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థ కార్యదర్శి రవీంద్ర, కోశాధికారి నాగరాజు, డైరెక్టర్లు నారాయణస్వామి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎం మునిరెడ్డి, కార్యదర్శి హెచ్ఎన్ రఘునాథరెడ్డి, సభ్యులు పీసీఎం రెడ్డి, కృష్ణప్ప, వీరప్ప, హరీశ్, పూర్వ విద్యార్థులు డాక్టర్ యల్లరెడ్డి, నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# టన్ను రూ.లక్ష

● మూడు నెలల్లోనే అమాంతం పెరిగిన దానిమ్మ

పుట్లూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దానిమ్మ రైతులకు మంచి రోజులు వచ్చాయి. ఇంతకాలం భారీగా పెట్టుబడులు పెట్టి పంటలు తీసినా.. సరైన ధరలు లేక ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. ఇటీవల దానిమ్మ ధరలు నెమ్మదిగా పెరుగుదల ప్రారంభమయ్యాయి. మూడు నెలల క్రితం టన్ను ధర రూ.50వేల నుంచి రూ. 60వేల వరకు ఉన్నాయి. ప్రస్తు తం టన్ను దానిమ్మ ధర లక్ష రూపాయల నుంచి రూ.1.10 లక్షల వరకు పలుకుతోంది. దీంతో గతంలో పెట్టుబడులకు చేసిన అప్పులను తీర్చుకోవచ్చని రైతులు ఆశిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 13,381 ఎకరాల్లో దానిమ్మ సాగుచేస్తున్నారు. పుట్లూ రు, యల్లనూరు, పెద్దపప్పూరు, యాడికి, తాడిపత్రి, నార్పల, రాప్తాడు తదితర మండలాల్లో ఎక్కువగా సాగుచేస్తున్నారు.

### ఇతర రాష్ట్రాల్లో దిగుబడి ఆలస్యం

ఇతర రాష్ట్రాల్లో దానిమ్మ దిగుబడి ఆలస్యం కావడంతోనే మన రాష్ట్రంలో ధర పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. ఆ రాష్ట్రాల్లో పంట రావడానికి సుమారు రెండునెలలు పడుతుందని తెలుస్తోంది. దీంతో మన దానిమ్మపండ్లకు డిమాండ్ పెరిగినట్లు సమాచారం. గుజరాత్, మహారాష్ట్ర ఇతర రాష్ట్రాల్లో పంట ఆలస్యమవుతున్నట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. అక్కడి వ్యాపారులు సైతం కొనుగోలు చేసేందుకు మన రాష్ట్రానికి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

### టన్ను ధర రూ.లక్ష పైగానే

మూడు నెలల క్రితం దానిమ్మ ధరలు టన్ను రూ.50వేల నుంచి రూ.60వేల వరకు మాత్రమే పలికాయి. ప్రస్తుతం టన్ను రూ.లక్ష నుంచి రూ.1.10 లక్షల వరకు పలుకుతోంది. రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే రైతులకు పంట చేతికి వస్తోంది. ధరలు ఆశించిన స్థాయిలో ఉన్నప్పుడే అమ్ముకుంటే అప్పులు తీరుతాయని పలువురు అమ్మకాలకు సిద్ధమవుతున్నారు. దానిమ్మపండ్లను తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.



### మౌలిక సదుపాయాలు కల్పించండి

పావగడ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని హొసదుర్గ గ్రామ దళిత కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సోమవారం ఈఓ ఉత్తమ్‌కు స్థానికులు వినతిపత్రం అందజేశారు. బీసీఎస్ అధ్యక్షుడు కెంచార మాట్లాడుతూ కాలనీలో 50 కుటుంబాలకుపైగా నివసిస్తున్నారన్నారు. ఒకే ఒక విద్యుత్ స్తంభం ఉందని, రాత్రి సమయాల్లో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారన్నారు. పీడీఓకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదన్నారు.



ఈఓ ఉత్తమ్‌కు వినతిపత్రం ఇస్తున్న బీసీఎస్ నాయకులు


# కృష్ణమ్మ పరుగులు..!

గొల్లపల్లి నుంచి హంద్రీనీవా కాలువల ద్వారా తరలింపు

మణూరు, హారేసముద్రం చెరువులకు జలకళ

రెండురోజుల్లో మడకశిర చెరువుకు..

ఆనందంలో ఆయకట్టు రైతులు



హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణమ్మ పరవళ్లు

మడకశిర, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల పరవళ్లతో మడకశిర ప్రాంతం పులకిస్తోంది. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న రైతన్నల కల నెరవేరబోతోంది. రెండు నెలలుగా కృష్ణమ్మ మడకశిర ప్రాంతంలో పరవళ్లు తొక్కుతూ హంద్రీనీవా కాలువల ద్వారా చెరువులకు చేరి జలకళ సంతరించుకుంటోంది. దీంతో రైతన్నలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. మడకశిర మండలంలోని మణూరు చెరువు ఇప్పటికే నిండిమరువ పారుతోంది. మరో రెండు రోజుల్లో హారేసముద్రం చెరువు కూడా నిండి మరువ పారనుంది. తర్వాత మడకశిర చెరువుకు నీరు చేరుతుంది. అనంతరం నియోజవర్గంలోని చెరువులకు నీరు మళ్లిస్తారు. కర్ణాటక సరిహద్దులోని మడకశిర నియోజవర్గంలో ఎలాంటి సాగునీటి వనరులు లేక ఇంత కాలం రైతులు వర్షాధార పంటలపైనే ఆధారపడుతూ వస్తున్నారు. పంటల సాగుకు అప్పులు చేసి దిగుబడులు రాక అవస్థలు పడుతున్నారు. తీవ్రవర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భజలాలు అడగంటి పోయి బోర్ల కింద సైతం పంటలు సాగు చేసే పరిస్థితి లేకుండా పోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మడకశిర ప్రాంతానికి వచ్చినప్పుడు.. కృష్ణా జలాలతో మడకశిర ప్రాంతంలోని చెరువులను నింపి తాగు, సాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి విన్నవించారు. ఆయన స్పందించి ఈ ప్రాంతంలోని చెరువులకు హంద్రీనీవా కాలువల ద్వారా కృష్ణా జలాలు నింపి తాగు, సాగునీటి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నేరుగా మడకశిర ప్రాంతంలోని చెరువులకు హంద్రీనీవా కాలువల ద్వారా కృష్ణా జలాలను తరలిస్తున్నారు.

### సాగులోకి ఆయకట్టు భూములు

మడకశిర నియోజకవర్గంలో 125 చెరువులు ఉన్నాయి. వాటి కింద 16,500 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. ఇవన్నీ ప్రస్తుతం బీడుగానే ఉన్నాయి. మడకశిర మండలంలో 29 చెరువులు, గుడిబండలో 23, అమరాపురంలో 24, అగళి మండలంలో 24 చెరువులు ఉన్నాయి. ప్రస్తుతం మడకశిర మండలంలోని మణూరు చెరువు నిండి మరువ పారుతుండగా.. హారేసముద్రం చెరువు రెండురోజుల్లో నిండి మరువ పారనుంది. తర్వాత మడకశిర చెరువుకు నీరు చేరతాయి. ఈ రెండు చెరువుల కింద 1278 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. దీంతో ఆ ప్రాంతంలో భూగర్భజలాలు పెరుగుతాయని, తద్వారా బోరుబావుల్లో నీరు సమృద్ధిగా వచ్చి పంటలసాగుకు అవకాశం ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### చెరువులకు చేరుతున్న నీరు

గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నేరుగా మడకశిర ప్రాంతంలోని చెరువులకు కృష్ణానది జలాలు హంద్రీనీవా కాలువల చేరుతున్నాయి. ఇప్పటికే మడకశిర మండలంలోని మణూరు చెరువు నిండి హారేసముద్రం చెరువుకు చేరుతున్నాయి. మరో రెండు రోజుల్లో హారేసముద్రం చెరువు నిండి మరువ పారనుంది. తర్వాత మడకశిర చెరువుకు నీళ్లు చేరతాయి.

- నాగార్జున, ఏఈ, హెచ్ఎన్ఎస్ఎస్

## చిన్నారులను కళల్లోనూ ప్రోత్సహించాలి



చిన్నారుల నృత్య ప్రదర్శన

బెంగళూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చిన్నారులను చదువుతోపాటు కళల్లోనూ ప్రోత్సహించాలని అప్పుడే వారిలో దాగియున్న ప్రతిభ బహిరంగం అవుతుందని స్పేస్ మ్యాటిక్ గ్లోబల్ ముఖ్యులు సారికా అభిప్రాయపడ్డారు. సౌందర్య పాఠశాల వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సారికా మాట్లాడుతూ కల్మషం లేని పిల్లల ఆసక్తిని గుర్తించేందుకు ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నందన రవిచందర్‌కు భారత్ గౌరవ్ అవార్డు



అవార్డు ప్రదానంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, చినజీయర్ స్వామిజీ తదితరులు

బెంగళూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భారత్ గౌరవ్ అవార్డు ఫౌండేషన్ నందన్ గ్రూప్ హోటల్స్ సీఎండీ డాక్టర్ రవిచందర్‌కు భారత్ గౌరవ్ అవార్డును ప్రదానం చేసింది. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, త్రిదండి చినజీయర్ స్వామిజీలు అవార్డును ప్రదానం చేశారు. పలురంగాలకు చెందిన సాధకులను సత్కరించారు. ఈమేరకు నందన గ్రూప్ సోమవారం నగరంలో ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రముఖ షట్లర్ సైనానెహ్వాల్ సహా ప్రముఖులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ నియంత్రణపై జాగృతి



తాలూకా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద జాగృతికి పచ్చజెండా

చింతామణి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో తాలూకా న్యాయసేవల ప్రాధికార, తాలూకా ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ, తాలూకా సంఘసంస్థల నేతృత్వంలో వరల్డ్ ఎయిడ్స్ డేను సోమవారం ఆచరించారు. ఎయిడ్స్ నియంత్రణపై జాగృతి చేపట్టారు. తాలూకా న్యాయవాదుల సంఘం అధ్యక్షులు, పదాధికారులు, ప్రభుత్వ ఆసుపత్రి పాలనా వైద్యాధికారులు, తాలూకా ఆరోగ్య అధికారులు, విక్రయం నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. తాలూకా ఆసుపత్రి నుంచి జాథా సాగింది. ఎయిడ్స్ ప్రబలే విధానాలపై నర్సింగ్ విద్యార్థులు నాటకరూపంలో ప్రదర్శించారు. తాలూకా న్యాయసేవల ప్రాధికార, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ జాథాకు పచ్చజెండా చూపారు. ఆసుపత్రి పాలనా వైద్యాధికారి డాక్టర్ సంతోష్‌కుమార్, తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని చింతామణి తాలూకాలో ఎయిడ్స్ కేసులు నమోదయ్యాయన్నారు. ఏటా హెచ్‌ఐవీ పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయని, వీటికి అడ్డుకట్ట వేసేలా పాఠశాల, కళాశాల స్థాయినుంచే జాగృతి కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు శివానంద్, కార్యదర్శి శ్రీనాథ్, కోశాధికారి చౌడప్ప, ఆసుపత్రి వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కన్నప్పనహళ్ళిలో కన్నడ రాజ్యోత్సవం



బస్సు డ్రైవర్, కండక్టర్‌లకు సన్మానం

శిడ్లఘట్ట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కన్నప్పనహళ్ళిలో కన్నడ రాజ్యోత్సవం ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోజూ కన్నప్పనహళ్ళి నుంచి పలిచేర్లు మార్గంలో సంచరించే కేఎస్‌ఆర్టీసీ బస్సులను పుష్పాలతో ముస్తాబుచేశారు. బస్సు డ్రైవర్, కండక్టర్‌లను సత్కరించారు. శిడ్లఘట్ట బస్సు డిపో మేనేజర్ నాగేశ్ మాట్లాడుతూ కన్నడ రాజ్యోత్సవం కేవలం ఒక ఆచరణ కాదని, ప్రతి కన్నడిగుడు తమ భాష, సంస్కృతి, సంప్రదాయాలను పెంచి పోషించే బాధ్యత అన్నారు. గ్రామాలలో కూడా యువకులు ఉత్సాహంగా స్వచ్ఛందంగా పాల్గొనడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేఎస్‌ఆర్టీసీ ట్రాఫిక్ అధికారి బీ వెంకటాచలపతి, గ్రామపెద్దలు లక్ష్మీనారాయణ, మంజునాథ, దేవరాజ్, మంజు, శివప్ప, వెంకటేశప్ప, కేఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1622.94 | 1629.87 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 2,235 | 2,860 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 6,322 | 6,441 |
| నీటి నిల్వ (టీఎంసీలు) | 69.96 | 93.57 |



మృతదేహాన్ని బయటకు తెస్తున్న గ్రామస్థులు

## నీటి కుంటలో పడి విద్యార్థి మృతి

బళ్లారి రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హగరి బొమ్మనహళ్లి తాలుకా బండి హళ్లి సమీపంలో నీటి కుంటలో పడి బాలుడు మృతి చెందాడు. ఆదివారం స్నేహితులతో కలిసి పృథ్వి(10) ఆడుకుంటూ కాలు జారి నీటికుంటలో పడ్డాడు. వెంటనే గమనించిన స్థానిక గొర్రెల కాపర్లు నీటిలో దూకి కాపాడే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే బాలుడు నీటిలో మునిగి మృత్యువాత పడ్డాడు. మరో ఇద్దరు చిన్నారులు నీటిలో మునగగా గొర్రెల కాపరులు రక్షించారు. దీనిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బాలుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. ఆదివారం సెలవురోజు కావడంతో ఆటపాటల్లో మునిగిపోయారని ఇంతలోనే ఇంత విషాదం జరిగిందని వాపోయారు. నీటిలో ఆడుకునే సమయంలో పెద్దలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి రాజేశ్ హొసమనె



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ ఇంద్రాణి, డాక్టర్ బసారెడ్డి తదితరులు



ప్లకార్డులతో ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు

# చికిత్స కంటే నివారణే నయం

● ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినంలో న్యాయాధికారి రాజేశ్ హొసమనె ● జిల్లావ్యాప్తంగా ర్యాలీలు

బళ్లారి సిటీ/గంగావతి/సిరుగుప్ప డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ ఒక ప్రమాదకరమైన వ్యాధి అని చికిత్సకు కంటే నివారణే నయమని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె అన్నారు. బెంగళూరు రాష్ట్ర ఎయిడ్స్ నివారణ సంఘం, జిల్లాపరిపాలన, జిల్లాపంచాయతీ,జిల్లా న్యాయ సేవల సంస్థ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, బళ్లారి ఎయిడ్స్ నివారణ దినం కార్యాక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న ప్రాణాంతక వ్యాధుల్లో ఎయిడ్స్ ఒకటి అని, 1981లో ఆఫ్రికా ఖండంలో కనిపించిన ఈ వ్యాధి క్రమంగా ప్రపంచమంతా వ్యాపించి 1984లో భారతదేశంలో తొలి కేసు నమోదయ్యిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖల ద్వారా ఈ వ్యాధిని తీవ్రంగా పరిగణించి వివిధ సౌకర్యాల ద్వారా హెచ్ఐవీ సోకిన వారికి సహాయం చేయడం ప్రారంభించాయన్నారు. 2013లో గణాంకాల ప్రకారం దేశంలో 38లక్షల మంది హెచ్ఐవీ సోకిన వారు ఉన్నారని ప్రపంచంలో 38కోట్ల మంది ఎయిడ్స్‌తో బాధపడుతున్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉండి అవగాహనతో ఎయిడ్స్‌పై పోరాడితే హెచ్ఐవీ వైరస్‌ను తరిమికొట్టడం సాధ్యమన్నారు. జిల్లాన్యాయ సేవల అథారిటీకి ఆర్‌టీ కేంద్రాల్లో ప్యానల్ న్యాయవాదులు ఉన్నారు. హెచ్ఐవీ రోగులు వారి పిల్లలు వారి చట్టపరమైన అవసారాల కోసం ఉచిత న్యాయ సహాయం, ప్రభుత్వ సౌకర్యాలను పొందవచ్చన్నారు. బాధితులు టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబరు 15100 కు కాల్ చేసి సమాచారం పొందవచ్చన్నారు. జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు మాట్లాడుతూ హెచ్ఐవీ ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేస్తున్న ప్రభుత్వం ప్రభుత్వేతర సంస్థలు చేస్తున్న అపారమైన సేవలను అభినందించారు. జిల్లాక్షయ నిర్మూలన, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారిణి డాక్టర్ ఇంద్రాణి మాట్లాడుతూ జిల్లాలో 4,53,000 మందికి హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించగా అందులో 13,692 మందికి పాజిటివ్‌గా తేలిందన్నారు. 2,127 మంది పురుషులు, 2704మంది మహిళలు, 34మంది లింగమైనార్టీలు. 329 మంది పిల్లలు సహా 5194 మంది ఏఆర్‌టీ చికిత్స కేంద్రంలో చికిత్స పొందుతున్నారన్నారు. కార్యక్రమానికి ముందు ఎయిడ్స్ నివారణ గురించి అవగాహన విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు ప్లకార్డులతో అవగాహన కల్పించారు. జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయం ముందు ప్రారంభమైన ఈ మార్చ్ సంఘం సర్కిల్, రాఘవేంద్ర సినిమా మందిరం, కేసీ రోడ్డు, మీనాక్షి సర్కిల్ మీదుగా సాగింది. గంగావతి, సిరుగుప్ప పట్టణాల్లో ఎయిడ్స్ అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కమ్యూనికేబుల్ డీసీజ్ అధికారి డాక్టర్ వీరేంద్రకుమార్, ఏఆర్టీ వైద్యాధికారి దినేశ్‌గుడి, రాష్ట్రకోఆర్డినేటర్ రమేశ్, నిత్యజీవ సంస్థ అధ్యక్షురాలు హేమలత, జిల్లా సూపర్‌వైజర్ గిరీశ్, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఖుర్షీద్ బేగం, డాక్టర్ సంగీత, వివిధ రక్తకేంద్రాలు, సిబ్బంది వర్గం తదితరులు పాల్గొన్నారు.



గంగావతిలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

## తీవ్రమవుతున్న కాలుష్య సమస్య: ప్రొఫెసర్ హిరేమఠ్

బళ్లారి సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నేడుప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యల్లో కాలుష్య సమస్య తీవ్రమైనదని గోవాలోని సనాజీ డెంపే సైన్స్ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ హిరేమఠ్ అన్నారు. సోమవారం నగరంలోని వీర శైవ కళాశాల బయోటెక్నాలజి విభాగం వాతావరణ వైవిధ్యం, రూపకల్పన అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇది సహజ ప్రక్రియ అయినప్పటికీ మానవ కార్యకలాపాల కారణంగా దాని తీవ్రత మనింత పెరుగుతోందన్నారు. వాతావరణ మార్పుల ప్రభావాలు, విధ్వంసం గురించి విద్యార్థులలో అవగాహన కల్పించారు. ఈసందర్భంలో కళాశాల ప్రిన్సిపాల్ మల్లనగౌడ, డాక్టర్ రాజశ్రీపాటిల్, డాక్టర్ రవికుమార్ నాయక్, డాక్టర్ శ్యామూర్తి, శరణగౌడ, వినోద్‌కుమార్ అనురాధ. తేజశ్విని, వందమందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

బళ్లారి రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలో సోమవారం సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. నగరంలోని బసవేశ్వర నగర్, ఎస్పీ సర్కిల్, వాల్మీకి సర్కిల్లో ఆయన పలు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నూతన మేయర్ గాదెప్ప, మున్సిపల్ కమీషనర్ మంజునాథ, మాజీ మేయర్ రాజేశ్వరి, కార్పొరేటర్‌లో సురేఖ మల్లన్నగౌడ, నూర్ మహమ్మద్ టీవీ ప్రసాద్, కాంగ్రెస్ ప్రముఖులు వెంకటేష్, శేఖర్, బోనాల నాగభూషణ గౌడ, యాల్పి పంపనగౌడ, కార్పొరేటర్‌లో మించు శ్రీనివాస్, వీఆర్‌ఎల్ శ్రీనివాస్, కవిత వన్నప్ప, కాంగ్రెస్ నాయకులు శ్రీధర్, బాలరాజు, చరణ్ అభి హౌస్సేన్ నగర్ రాజు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

# హొసూరు జోన్


## టమోటా పంటకు వైరస్



వైరస్ సోకిన టమోటా

హొసూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): హొసూరు ప్రాంతంలో 75 శాతం టమోటా పంటలు వ్యాధులు, కీటకాల దాడికి గురైందని రైతులు దిగులు చెందుతున్నారు. హొసూరు చుట్టుపక్కల ప్రాంతాలలో టమోటాలు, బీన్స్ వంకాయ వంటి కూరగాయల పంటలను భారీ ప్రమాణంలో సాగు చేస్తున్నారు. ఇక్కడ పండించే కూరగాయలను తమిళనాడుకు మాత్రమే కాకుండా కర్ణాటక, కేరళకు కూడా ఎగుమతి చేస్తారు. హొసూరు ప్రాంతంలో 4 వేల ఎకరాలకు పైగా టమోటాలు సాగు చేస్తారు, ఈ పరిస్థితిలో కొన్నివారాల క్రితం కురిసిన వర్షాల కారణంగా 75 శాతం టమోటా మొక్కలు, టమోటాలు వ్యాధులు, తెగుళ్ల బారిన పడ్డాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యాధులు, తెగుళ్లను నియంత్రించడానికి నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులను అందించాలని రైతులు కోరుతున్నారు. ఓబేపాళ్యం ప్రాంత రైతులు మాట్లాడుతూ ఏడాది పొడవునా టమోటా పంట మాత్రమే సాగు అవుతుందన్నారు. ఇటీవలి కాలంలో పంటకు ఎర్రటి పురుగులు గుడ్లు పెట్టడంతో కీటకాలు పంటను నాశనం చేస్తున్నాయన్నారు. పిచికారీ చేసినా ప్రయోజనం లేకపోతోందని విచారం వ్యక్తం చేశారు. పంట తెగుళ్ల నివారణకు ప్రభుత్వం, అధికారులు తగిన చొరవ చూపి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## కొత్తిమీర కట్ట రూ.80



కొత్తిమీర పంట

హొసూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): హొసూరు, చుట్టుపక్కల ప్రాంతాలలో అన్ని రకాల కూరగాయలు, పండ్లు సాగు చేస్తారు. హొసూరు, కెలమంగలం, బేరికై, బాగలూరు, ఊద్దన్నపల్లి వంటి ప్రాంతాలలో సుమారు 5వేల ఎకరాల విస్తీర్ణంలో కొత్తిమీర సాగు అవుతోంది. కొన్నివారాల క్రితం వరకు కొత్తమీర కట్ట రూ.10 ఉండేది. అయితే ఇటీవల వర్షాలతో దిగుబడి తగ్గగా మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. దీంతో హొసూరు రైతు బజారులో సోమవారం కట్ట రూ.80 పలికింది. సుదీర్ఘకాలం తర్వాత కొత్తమీరకు మంచి ధర పలికిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎకరానికి 3 కిలోల కొత్తిమీర గింజలు నాటితే 30 రోజుల్లో 100 కట్టల కొత్తిమీర పంటను పొందవచ్చన్నారు. కొత్తిమీర డిమాండ్ పెరగడంతో వ్యాపారులు నేరుగా పంట కోయడానికి తమ కార్మికులతో రవాణా చేస్తున్నారు. ఖర్చులు కొంతమేర తగ్గాయని రైతులు సంతోషిస్తున్నారు.

## నేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉద్యోగ మేళా

రాయచూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాయచూరు నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు యాదగిరి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రెండు చోట్ల డిసెంబరు 2వ తేదీ మంగళవారం ఉద్యోగ మేళా ఏర్పాటు చేశామని నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యంకణ్ణ తెలిపారు. సోమవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేఖరులతో మాట్లాడిన యంకణ్ణ, రెండు చోట్ల ఉద్యోగ మేళాల్లో 15 కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. ఇప్పటికే ఉద్యోగ మేళాలో పాల్గొనేందుకు 775 మంది విద్యార్థులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోని వారు నేరుగా మేళాకు హాజరు కావచ్చన్నారు.

## రూ.1.75 లక్షల బంగారు వాచీ చోరీ

హొసూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): హొసూరు సిప్‌కాట్ ప్రాంతంలోని ఒక ప్రైవేట్ కర్మాగారం నుంచి రూ.1.75 లక్షల విలువైన బంగారు గడియారం చోరీకి గురైంది. ఒక ప్రైవేట్ కర్మాగారం తరపున వాచ్ విక్రయ కేంద్రం ఉంది. ఫ్యాక్టరీ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా బంగారు వాచీని సిద్ధం చేసింది. అక్కడికి వచ్చిన ఒక అనుమానాస్పద వ్యక్తి ఆ వాచ్‌ను కొనుగోలు చేసేందుకు వచ్చి బంగారు గడియారాన్ని దొంగిలించాడు. ప్రైవేట్ కర్మాగార మేనేజర్ నల్లుస్వామి సిప్‌కాట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## 'అదానీ' సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

కంప్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏర్పాటు చేసే ఉచిత ఆరోగ్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగపరచుకోవాలని సిద్దమ్మనహళ్లి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు యశోద సూచించారు. సోమవారం సిద్దమ్మనహళ్లి గ్రామంలో అదానీ సంస్థ వైద్య శిబిరం ఏర్పాటు చేశరు. ఇందులో డాక్టర్ సమీర్ బాష, డాక్టర్ విద్య, డాక్టర్ వినయ్, డాక్టర్ ఖాసీం సాబ్ తదితర డాక్టర్లు శిబిరంలో వివిధ రోగులకు సుమారు 300 మందికి పైగా చికిత్స కల్పించారు. ఈ సందర్భంగా అదానీ సంస్థ సీఎస్ఆర్ అధికారి రిజ్వాన్ మాట్లాడుతూ.. గ్రామంలో పేదలను దృష్టిలో వుంచుకుని ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రమాలి రిజ్వాన్ షేక్ ఉపాధ్యక్షులు గ్రామ పంచాయతీ సభ్యులు, గ్రామస్తులు ఆరోగ్యశాఖ గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వీరభద్రేశ్వర స్వాముల జాతర

సిరుగుప్ప, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన వీరభద్రేశ్వరస్వాముల జాతర మహారథోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. హళేకోట గ్రామంలో వెలసిన వీరభద్రస్వాముల జాతర మహారథోత్సవం, అగ్నిగుండం కార్యక్రమం జరగడం ఆనవాయితీ ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి భక్తులు అగ్నిగుండంలో నడిచివెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు రథంపైకి పూలు, పండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో రాయచూరు, బళ్లారి, కొప్పళ, కర్నూలు జిల్లా వాసులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వాముల ఆశీర్వాదాలు పొందారు.

# పాఠశాల మూసివేత నిర్ణయంపై ఆందోళన



నిరసన తెలుపుతున్న ఏఐడీఎస్ఎస్‌ఓ నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు

బళ్లారి సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గుడార నగరంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ, కేపీఎస్ మాగ్నెట్ పాఠశాలల పేరుతో 40వేల పాఠశాలలను మూసివేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యకు వ్యతిరేకంగా సోమవారం ఏఐడీఎస్ఎస్‌ఓ విద్యార్థి సంస్థ నాయకత్వంలో విద్యార్థులు,తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. నిరసనను ఉద్దేశించి ఏఐడీఎస్‌ఓ జిల్లా అధ్యక్షుడు ఈరన్న మాట్లాడుతూ.. గుడార నగర ప్రజలు కేపీఎస్ మాగ్నెట్ స్కూల్‌ను శ్రీధరగడ్డ గ్రామ పాఠశాలలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నా రన్నారు. ఇక్కడ నివసించే వెయ్యి మందికి పైగా ప్రజలు సంచార జాతులు, కార్మికులు పిల్లలను ఉదయం 6గంటలకు వదిలి వెళ్తే సాయంత్రం 6గంటలకు ఇళ్లకు చేరుతారన్నారు. రోజంతా పాఠశాలలో పిల్లలు గడిపే పాఠశాలను మూసివేయడం తగదన్నారు. ప్రభుత్వ తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. దేశ విద్యకోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి అందరికీ విద్యచేరాలనే కోరిక గొప్ప మానవతావాదులు జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి, గొప్ప విప్లవకారులు భగత్‌సింగ్, నేతాజీ సుబాస్ చంద్రబోస్, సాతంత్ర్యం తర్వాత అధికారంలోకి వచ్చిన అన్ని ప్రభుత్వాలు విద్యకు ద్వారాలు మూసేస్తే తీవ్రంగా ఉద్యమిస్తామన్నారు. ఏఐడీఎస్ఎస్‌ఓ సభ్యుడు తిప్పేస్వామి, కాంతేశ్, రాము, బాబు,కళ్యాణ్ కుమార్. మందాకిని, లలితాబాయి, మారెక్క పాల్గొన్నారు.

## విద్యతోనే మహిళా సాధికారత: డాక్టర్ శివలింగప్ప



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శివలింగప్ప హందిహాలు

బళ్లారి సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యా ద్వారానే బాలికలకు సాదికారత లభిస్తుందని, తద్వార మహిళా సాధికారత సాధ్యమవుతుందని కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ శివలింగప్ప హందిహాలు అన్నారు. నగరంలోని ప్రభుత్వ ఫస్ట్ క్లాస్ మహిళా కళాశాలలో జరిగిన విద్యార్థులు స్వాగత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బళ్లారి అంటే కేవలం గనులు, జీన్స్ మాత్రమే కాదని, కళా, సాహిత్యం నాటక రంగంలో తమ కంటూ ఒక పేరు తెచ్చుకున్న నగరమన్నారు. బళ్లారి రాఘవ, జోళదరాశి దొడ్డనగౌడ, మన్సూర్ సుభద్రమ్మ వంటి గొప్పసాధకులు ఈ జిల్లాలో ఉన్నారన్నారు. అమ్మాయిలు ప్రత్యేక విజయాలు సాధించినప్పుడే మీ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ప్రజ్ఞా మాట్లాడుతూ బాలికలు విద్యకు దూరం కాకూడదని ఉన్నత విద్యను పొంది మంచి నిపుణులుగా ఎదగాలన్నారు. అప్పుడే బాలికలు గౌరవప్రదమైన హోదా పొందగలరన్నారు. ఈసందర్భంగా ఆచార్యులు మల్లికార్జున, సి.కొట్రప్ప, మరిగాదిలింగప్ప, శివరాజ్, స్నేహ, బిందు, సుజాత, భావన, కళాకారులు పాల్గొన్నారు.

## నీలమ్మదేవి, పేట బసవేశ్వరుడికి ఎమ్మెల్యే పూజలు



పేట బసవేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): కంప్లి పట్టణంలో ప్రసిద్ధి గాంచిన నీలమ్మదేవి, పేట బసవేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే గణేష్ సోమవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. జోడు రథోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ గ్రామాల్లో పట్టణాల్లో ధార్మిక కార్యక్రమాల వల్లే ప్రశాంతత నిల్వ వుంటుందని తెలిపారు. ఏ పండుగలు జరిగిన అన్ని కులాలు, మతాలు కలిసిపోయి ఐక్యతతో జరుపుకున్నప్పుడే ఆ పండుగ వైభవంగా జరుగుతాయని తెలిపారు. కంప్లి పట్టణంలో నీలమ్మదేవి పేట బసవేశ్వరస్వామి జోడు రథోత్సవం ఎలాగో కురుగోడు పట్టణంలో నీలమ్మదేవి, దొడ్డ బసవేశ్వర స్వామి రథోత్సవం కూడా ఇదే మాదిరిగానే జరుపుకుంటామని తెలిపారు. వారితో పాటు శ్రీనివాసరావు, శరణగౌడ, సిద్దప్ప, హనుమంతు, సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.

# నగరాభివృద్ధికి నిబద్ధతతో కృషి: మంత్రి

రాయచూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మహానగర పాలికగా అప్‌గ్రేడ్ చేసిన నగరాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిభద్ధతతో కృషి చేస్తున్నట్లు రాష్ట్ర చిన్ననీటి పారుదల సైన్స్ అండ్ టెక్నాలజి శాఖల మంత్రి ఎన్ఎస్ భోసరాజు అన్నారు. నగరాభివృద్ధి ప్రాధికార ద్వార చేపట్టిన అంబేద్కర్ సర్కిల్ అభివృద్ధి పనులకు సోమవారం మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేయడంతోపాటు రోడ్లను మరింత అభివృద్ధి చేసి నగరాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు.



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి భోసరాజు

## మొక్కజొన్న రైతులకు న్యాయం చేయాలి

● బీజేపీ డిమాండ్ ● రెండో పంటకు నీరివ్వాలని వినతి



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు, రైతులు

గంగావతి రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధర అందజేసి న్యాయం చేయాలని, రెండో పంటకు సాగు నీరు ఇవ్వాలని బీజేపీ డిమాండ్ చేసింది. జిల్లా కేంద్రంలోని అశోక్ సర్కిల్ వద్ద సోమవారం బీజేపీ నేతృత్వంలో మొక్కజొన్న రైతుల సమస్యలపై భారీ ఎత్తున ఆందోళన జరిగింది. కనీస ధర పెంపు, రెండో పంటకు నీటి విడుదల కోసం బీజేపీ నాయకులు, కార్యకర్తలు రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బజవరాజు, కుష్టిగి ఎమ్మెల్యే దొడ్డనగౌడ్ పాటీల్, గంగావతి మాజీ ఎమ్మెల్యే పరమ మనవళ్లి జిల్లా మాజీ అధ్యక్షుడు విరుపాక్షప్ప ఆందోళన కార్యక్రమంలో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిట్టుబాటు ధరలేక మొక్కజొన్న రైతు పరిస్థితి దయనీయనీయంగా మారిందన్నారు. ఎకరాకు కనిష్టంగా రూ.25వేలు ఖర్చు అవుతోంది. వర్షాల మీదే ఆదారం పడి పండే ఈ పంటకు కేవలం ఏడాదికి ఒక్క అవకాశం మాత్రమే ఉంటుంది. ఇంత కష్టపడి పండించిన రైతు మార్కెట్‌కి తీసుకెళ్తే దళారులు, రూ.1300, 1400కే కొనుగోలు చేయడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు జీవితాలతో ఆడుకుంటోందన్నారు. మొక్కజొన్నకి క్వింటాలు కనీసం రూ.2,400 ధర ప్రకటించాలన్నారు. ప్రభుత్వం స్వయంగా పంటను కొనుగోలు చేసి రైతులకు ఊరట కల్పించాలన్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు తప్పవు అని హెచ్చారించారు. కాంగ్రెస్ నాయకులు పాలనను పక్కన పెట్టి అధికార కుర్చీకోసం కొట్లాగుతూనే ఉన్నారని విమర్శించారు. రైతు సమస్యల్ని మాత్రం పట్టించుకునే పరిస్థితిలోనే లేదు. తుంగభద్ర డ్యాంలో నీరు ఉన్నా రెండో పంటకు విడుదల చేయకుండా రైతులను వేధించడం తగదన్నారు. సింగనాల మాజీ అధ్యక్షుడు తిప్పేరుద్రస్వామి, హేమలతనాయక్, నవీన్, మాజీ ఎంపి శివరాం గౌడ, తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరం కృష్ణమాచార్యుల 113వ వర్ధంతి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నరాఘవ అసోసియేషన్ అధ్యక్షుడు చనప్ప

బళ్లారి సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రనాటక పితామహుడు ధర్మవరం రామకృష్ణమాచార్య 113వ వర్ధంతిని ఆదివారం సాయంత్రం నగరంలోని రాఘవ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాఘవ కళామందిరంలో నిర్వహించారు. రాఘవ మెమోరియల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చన్నప్ప జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు నాటక రచనలో సుప్రసిద్ధుడైన ధర్మవరం రామకృష్ణమాచార్య అనేక నాటకాలు రాశారన్నారు. ఆయన నాటకాలను ఆయన బావమరిది నాట్య కళాప్రపూర్ణ బళ్లారి రాఘవ అద్భుతంగా ప్రదర్శించారని సంస్థ మాజీ గౌరవ కార్యదర్శి బసవరాజు అన్నారు. అనంతరం గుర్రం సాకమ్మ రామయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో జీఆర్ వెంకటేశులు రచన, నిర్దేశనంలో 'మేము చేసిన పాపమేమిటీ' నాటక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈసందర్భంగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బణాపుర రమేశ్‌గౌడ,కోశాధికారి ధనుంజయ, జంటి కార్యదర్శి ఎం.నటరాజ్, కే.రామాంజనేయులు, పంపనగౌడ, కృష్ణ, టీటీ విఠల, రామాంజనేయులు, ప్రభాకర్, సురేంద్రబాబు, భాస్కర్‌నాయుడు, భీమనేని ప్రసాద్, రామచంద్ర, శేషారెడ్డి, మనోరమా, రమణప్ప, అణ్ణాజి కృష్ణారెడ్డి తదితరులున్నారు.

## అంజనాద్రికి మాలధారుల పాదయాత్ర

గంగావతి రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎల్బుర్గా తాలూకా నుంచి గంగావతి తాలూకాలోని అంజనాద్రి పర్వతం వరకు కాలినడకన భక్తులు సోమవారం బయల్దేరారు. హనుమమాల దీక్ష విసర్జన కోసం హనుమాన్ భక్తులు భారీ సంఖ్యలో పాదయాత్ర చేశారు. డిసెంబరు 3న జరగనున్న హనుమమాల విసర్జన మహోత్సవానికి హాజరయ్యేందుకు 130 కిలోమీటర్ల దూరాన్ని పాదయాత్రగా వెళ్తున్నట్లు వారు తెలిపారు. వెంకటేశ్, శివు, ఆంజనేయ, పర్సప్ప, ముంజునాథ్ తదితరులు బయల్దేరారు. ఏటా పాదయాత్రగానే వెళ్లామని వారు తెలిపారు.



పాదయాత్రగా వెళ్తున్న భక్తులు